# శాసనసభ కమిటీలు

# (రూలు 195 నుండి 297(ఐ))

పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల సభయైన శాసనసభకు సమష్టి బాధ్యత వహిస్తుంది. సంక్షేమరాజ్యాన్ని నెలకొల్పాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఆ లక్ష్యసాధనకై జరుపుతున్న అభివృద్ధి కృషిలో ప్రభుత్వ కార్యకలాపాలు ఎన్నో విధాల పెరిగాయి. తత్ఫలితంగా శాసనసభ కార్యభారం కూడా ఎంతగానో పెరిగింది. శాసనపరమైన విషయాలన్నింటి పైన సవివరంగాను, సవిస్తారంగాను పరిశీలించాలన్నా, శాసనసభ సమక్షానికి తీసుకువచ్చే ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా చర్చించి నిర్ణయించాలన్నా సభకు తగినంత సమయం లభించదు. సమయం చాలా పరిమితం. అందుచేత చాలా పని సభా కమిటీలలో జరుగుతుంది. ప్రతి అంశాన్ని ఈ కమిటీలు నిశితంగా పరిశీలించి, సవివరంగా చర్చలు జరిపి నియమ బద్ధంగా నిర్ణయాలను తీసుకుంటాయి. ఈ కార్యక్రమ నిర్వహణలో కమిటీలు నిపుణుల సలహాలను పొందవచ్చు. నిర్ణయాలను తీసుకోవచ్చు. ఆ నిర్ణయాలను నివేదికలో పొందుపర్చి సభకు సమర్పిస్తుంది కమిటీ. ఈ కమిటీలను శాసనసభ కమిటీలని పిలుస్తారు. కమిటీ అనగా సభ నియమించిన లేక ఎన్నుకొన్న లేక సభాపతి ఏర్పాటు చేసిన లేక శాసనసభ నియమావళి ప్రకారం ఏర్పాటైన కమిటీ ఏదైనా కావచ్చు. సెలెక్టు కమిటీ కూడా సభా కమిటీయే. శాసనసభ కమిటీలు రెండు రకాలు. అవి తాత్కాలిక కమిటీలు, స్థాయీ కమిటీలు.

## తాత్కాలిక కమిటీలు :

నిర్దిష్టమైన పనులకై తాత్కాలిక కమిటీలను ఏర్పాటు చేస్తారు. ఆ కమిటీలు వాటికి అప్పగించిన పనులు పూర్తయి నివేదికను



సమర్పించిన వెంటనే రద్దవుతాయి. చిత్తుచట్టాలపై వేయు సెలెక్టు కమిటీలు ఏదేని సంస్థ విషయంలో జరిగిన అక్రమాలను పరిశీలించే నిమిత్తం నియమితమగు సభా కమిటీలను తాత్కాలిక కమిటీలంటారు.

## స్థాయీ కమిటీలు :

శాసనసభలో ఈ క్రింది స్థాయీ కమిటీలు ఉంటాయి.

1. కార్యక్రమ సలహా కమిటీ.
2. అర్జీల కమిటీ
3. సభాహక్కుల కమిటీ (విశేషాధికారాల కమిటీ)
4. ప్రభుత్వ హామీల కమిటీ
5. అనుగత చట్ట నిర్మాణ కమిటీ
6. ప్రభుత్వ లెక్కల కమిటీ
7. అంచనాల కమిటీ
8. ప్రభుత్వ సంస్థల కమిటీ
9. అనుసూచిత జాతుల సంక్షేమ కమిటీ
10. అనుసూచిత వర్గాల సంక్షేమ కమిటీ
11. స్త్రీ, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ కమిటీ
12. అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ కమిటీ
13. సదుపాయాల కమిటీ
14. సాధారణ ప్రయోజనాల కమిటీ
15. గ్రంథాలయ కమిటీ
16. నియమముల కమిటీ
17. నైతిక విలువల కమిటీ
18. వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ కమిటీ

కమిటీ సభ్యులను సభాపతి నియమింపవచ్చును. లేదా సభ ఎన్నుకోవచ్చును. కమిటీలో పని చేయటానికి యిష్టపడని యే సభ్యునైయైన కమిటీ సభ్యుడిగా నియమింపరాదు. కార్యక్రమ సలహా కమిటీకి, సభా హక్కుల కమిటీకి, అర్జీల కమిటీకి,



ప్రభుత్వ హామీల కమిటీకి, నియమముల కమిటీ మున్నగు వాటికి శాసనసభలోని సభ్యులను సభాపతి నామనిర్దేశం చేస్తారు. ప్రతి కమిటీలో వీలైనంత వరకు వివిధ పార్టీల వారు, బృందాల వారు ప్రాతినిధ్యం వహిస్తారు. ఆ కమిటీలలో ప్రతి కమిటీకి చైర్మన్ ను సభాపతి నామనిర్దేశం చేస్తారు. ఒక వేళ ఆర్థిక కమిటీలు అయినట్లయితే, ఆమూడింటికీ అనగా ప్రభుత్వ లెక్కల కమిటీ, ప్రభుత్వ సంస్థల కమిటీ, అంచనాల కమిటీలకు ఒక్కొక్క దానికి సంబంధించి ఉభయ సభలలో ప్రవేశపెట్టి, అంగీకరించిన ప్రతిపాదనను అనుసరించి శాసనసభ సభ్యుల నుండి తొమ్మిది మందినీ, శాసన పరిషత్తు సభ్యుల నుండి ముగ్గురిని ఎన్నుకుంటారు.

## అధ్యక్షుల నియామకం :

శాసనసభ ఆయా కమిటీల సభ్యులలో ఒకరిని ఆయా కమిటీలకు అధ్యక్షునిగా సభాపతి నియమిస్తారు. సభాపతి ఏ కమిటీలోనైనా సభ్యులుగా ఉన్నయెడల ఆయన ఆ కమిటీకి అధికారరీత్యా అధ్యక్షులుగా ఉంటారు. సభాపతి లేని కమిటీలలో ఉప సభాపతి సభ్యుడిగా ఉన్న ఆయనను ఆ కమిటీ అధ్యక్షునిగా నియమిస్తారు.

## పదవీ కాలం:

సభాపతి నియమించిన కమిటీ సభాపతి వివరించిన కాలానికిగాని, కొత్త కమిటీ నియమితమయ్యేవరకు గాని అధికారంలో ఉంటుంది.

## కోరం : (రూల్ 201)

కమిటీ సమావేశం జరపటానికి సభ్యులు కనీస సంఖ్యలోనైనా హాజరుకావాలి. అటువంటి సంఖ్యను కోరం అంటారు. కమిటీ మొత్తం సభ్యులలో మూడవ వంతు కోరంగా ఉండాలి. కోరం లేకపోతే అధ్యక్షులు కమిటీ సమావేశాన్ని కోరం వచ్చే వరకు వాయిదా వేస్తారు.



## కమిటీ సమావేశాలు :

కమిటీ అధ్యక్షులు నిర్ణయించిన రోజున ఆ సమయాన కమిటీ సమావేశం జరుగుతుంది. కమిటీ సమావేశం గుప్తంగా జరుగుతుంది.

## కమిటీలో ఓటింగు:

కమిటీ సమావేశంలో హాజరై, ఓటు చేసిన సభ్యులలో అధిక సంఖ్యాకులచే అన్ని విషయాలు నిర్ణయించబడతాయి. ఓట్లు సమానంగా వస్తే, అధ్యక్షత వహించిన వ్యక్తి నిర్ణాయకపు ఓటు ద్వారా ఆ విషయాన్ని నిర్ణయిస్తారు.

## కార్యక్రమ సలహా కమిటీ: (రూల్ 231 నుండి 235)

(1) సభా నాయకునితో సంప్రదించి సభాపతి ఏయే ప్రభుత్వ చిత్తు చట్టాలు, ఇతర కార్యక్రమం కమిటికి పంపించవలెనని ఆదేశించునో, అట్టి చిత్తు చట్టాల దశను లేక దశలను మరియు ఇతర కార్యక్రమం చర్చించు నిమిత్తం కేటాయింపవలసిన సమయాన్ని గురించి సిఫారసు చేయుట యీ కమిటీ విధి.

(2) ఏయే సమయాలలో చిత్తు చట్టపు వివిధ దశలు యితర కార్యక్రమం పూర్తి చేయవలెనో, అట్టి వేర్వేరు సమయూలను సంకల్పించిన సమయ పట్టికలో సూచించుటకు కమిటీకి అధికారం ఉంటుంది.

(3) ఆయా సమయములందు సభాపతి అప్పగించే ఇతరత్రా విధులను కూడా కమిటీ కలిగియుండును.

## అర్జీల కమిటీ : (రూల్ 247 & 248)

(1) కమిటీ తనకు పంపబడిన ప్రతి అర్జీను పరిశీలింపవలెను మరియు అర్జీ నియమముల కనుగుణముగా ఉన్న యెడల అది సభ్యులకు అందచేయబడవలెనని సమితి ఆదేశింపవచ్చును,

అర్జీ అందచేయబడవలెనని ఆదేశింపబడని యెడల, సభాపతి ఏ సమయములోనైన అర్జీ అందజేయబడవలెనని ఆదేశించవచ్చును.

(2) సందర్భానుసారముగ సమితి లేక సభాపతి ఆదేశించు విధముగా అర్జీ సమగ్ర లేక సంగ్రహ రూపములో అందజేయబడవలెను.

(3) కమిటీ తానుచితమని భావించినట్టి సాక్ష్యమును తీసుకున్న తర్వాత, తనకు పంపబడిన అర్జీలో చేయబడిన నిర్దిష్టమైన ఫిర్యాదుపై సభకు నివేదించుట మరియు సమీక్ష కేసుకు వర్తింపదగు లేక భవిష్యత్తులో అట్టి కేసును నివారించుటకు ఖచ్చితమైన రూపములో పరిహారక చర్యలను సూచించుట కూడా కమిటీ విధియై యుండును.

ఉప సభాపతితో కలిసి ఏడుగురు సభ్యులకు మించని సభ్యులతో ఈ కమిటీని సభాపతి నియమిస్తారు.

**సభా హక్కుల లేక విశేషాధికారాల కమిటీ : (రూలెన 256 నుండి 259)**

(1) కమిటీ తమకు పంపబడిన ప్రతి విషయమును పరిశీలించి, ప్రతికేసునందలి అంశములకు సంబంధించి అందు విశేషాధికారముల ఉల్లంఘన జరిగినదా లేదా, జరిగినచో ఉల్లంఘన స్వభావమును, అందుకు దారి తీసిన పరిస్థితులను నిర్ణయించి, కమిటీ తమకు ఉచితమని భావించిన సిఫారసులను చేయవలెను.

(2) కమిటీచే చేయబడిన సిఫారసులను అమలు జరుపుటలో సభచే అనుసరింపబడవలసిన కార్యవిధానమును కూడా నివేదికలో పేర్కొనవచ్చును.

(3) ఏడుగురు సభ్యులకు మించని సభ్యులతో ఈ కమిటీని సభాపతి నియమిస్తారు.

**ప్రభుత్వ హామీల కమిటీ : (రూల్ 267 & 268)**

మంత్రులచే సభలో ఆయా సమయములందు ఈయబడిన హామీలు, వాగ్దానములు, పూచీలు మొదలైన వాటిని పరిశీలించి

(ఎ) ఆ హామీలు, వాగ్దానములు, పూచీలు మొదలైనవి ఏ మేరకు అమలు జరుపబడినవో నివేదించుట

(బి) అమలు పరచిన సందర్భములలో అందుకు అవసరమైన కనీస కాలములో అట్లు అమలు పరిచినది లేనిది నివేదించుట ప్రభుత్వ హామీల కమిటీ విధులు.

**అనుగత చట్టనిర్మాణ కమిటీ : (రూల్ 260 నుండి 264)**

నిబంధనలు, నియమములు, ఉపనియమములు, ఉపనిబంధనలు మొదలగు వాటిని రూపొందించుటకు రాజ్యాంగచట్టం ద్వారా సంక్రమించిన లేక శాసనసభ ప్రదానము చేసిన అధికారములు అట్టి అధికార ప్రధానమునకు లోబడి సరిగా వినియోగింప బడుచున్నది లేనిది పరిశీలించి సభకు నివేదించుట అనుగత చట్ట నిర్మాణ కమిటీ విధులు.

12 మంది సభ్యులకుగాను 9 మంది శాసనసభ నుండి, ముగ్గురు శాసనమండలి నుండి ప్రాతినిధ్యం వహించే విధంగా ఈ కమిటీని సభాపతి నియమిస్తారు.

**ప్రభుత్వ లెక్కల కమిటీ : (రూల్ 249 & 250)**

(1) రాష్ట్ర ప్రభుత్వ వ్యయమునకై సభచే మంజూరు చేయబడిన మొత్తముల వినియోగమును తెలుపు లెక్కలను, రాష్ట్ర ప్రభుత్వపు సాలీనా ఆర్థిక లెక్కలను, కమిటీ యుక్తమని భావించినట్టి సభా సమక్షమున ఉంచబడిన తదితర లెక్కలను ప్రభుత్వ లెక్కల కమిటీ పరిశీలించును.

(2) రాష్ట్ర ప్రభుత్వము యొక్క ధన వినియోగపు లెక్కలను, వాటిపై కంప్ట్రోలరు అండ్ ఆడిటర్ జనరల్ యొక్క నివేదికలను పరిశీలించునప్పుడు ప్రభుత్వ లెక్కల కమిటీ కర్తవ్యమేమనగా....

(ఎ) బట్వాడా చేయబడినట్లు లెక్కల్లో చూపబడిన ద్రవ్యము ఏ సర్వీసు లేక ప్రయోజనము నిమిత్తము వినియోగించబడినదో లేక ఛార్జి చేయబడినదో, అందుకొరకే చట్ట ప్రకారము ఆ ద్రవ్య లభ్యం చేయబడి వినియోగించబడినది యుండునని రూఢి చేసుకొనుట.

(బి) ఏ అధికారమును బట్టి వ్యయము చేయబడినదో ఆ అధికారమునకు ఆ వ్యయము అనుగుణముగా నున్నదని రూఢి చేసుకొనుట.

(సి) తగిన అధికార వర్గముచే రూపొందింపబడిన నియమముల క్రింద ఇందుకు సంబంధించి తయారు చేయబడిన నిర్దేశములననుసరించి ప్రతియొక్క పున: ధనవినియోగము చేయబడినదని రూఢి చేసుకొనుట.

పై రీతిగా రూఢి కానట్టి ప్రతి విషయమును, మరియు ఆర్థిక శాఖ కోరిన వ్యయము నంతటిని, శాసనసభ దృష్టికి తీసుకురావలెను.

(3)ఈ దిగువ విషయములను నిర్వహించుట కూడా ప్రభుత్వ లెక్కల కమిటీ కర్తవ్యము.

(ఎ) తయారు చేయవలెనని గవర్నరు ఆదేశించెడి లేక ప్రత్యేక సంస్థ, వ్యాపార లేక ఒక ఉత్పత్తి పథకము లేక వాణిజ్య సంస్థ లేక ప్రాజెక్టు యొక్క పెట్టుబడిని క్రమబద్ధముచేయు చట్టబద్ధమైన నియమావళి యొక్క నిర్దేశముల క్రింద తయారు చేయబడిన ప్రభుత్వ సంస్థల, వ్యాపార మరియు ఉత్పత్తి పథకముల, వాణిజ్య సంస్థల మరియు ప్రాజెక్టుల యొక్క ఆదాయ వ్యయములను తెలుపు లెక్కల వివరణమును, వాటిపై బ్యాలన్స్ షీట్లు మరియు లాభనష్టముల లెక్కల వివరణములతో సహా మరియు అందుపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదికను పరిశీలించుట.

(బి) గవర్నరు యొక్క అదేశముల క్రింద లేదా రాష్ట్ర శాసనమండలియొక్క చట్టము ద్వారా భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ ఆడిట్ నిర్వహించవబడదగు వ్యయం పాలనా ప్రతిపత్తిగల మరియు పాక్షిక స్వయంపాలనా ప్రతిపత్తిగల మండలులు యొక్క ఆదాయ వ్యయములను తెలుపు లెక్కల వివరణమును పరిశీలించుట

(సి) గవర్నరు రాబడులను వేటినైనా ఆడిట్ చేయవలసినదిగా గాని, స్టోరుల స్టాకుల లెక్కలను పరిశీలించ వలసినదిగాని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ను కోరియుండినచో, వాటిని గురించి ఆయన సమర్పించిన నివేదికను పరీక్షించుట.

(5) ఏదేని ఒక సర్వీసు నిమిత్తము సభచే మంజూరు చేయబడిన మొత్తము కంటే యేదేని అధిక ధనము ఒక ఆర్థిక సంవత్సరములో అందుకై వ్యయ పరచబడిన యెడల, కమిటీ ప్రతికేసుకు సంబంధించిన విషయమును, అట్టి ఆర్థిక వ్యయమునకు దారి తీసిన పరిస్థితులను పరీక్షించి, తమకు యుక్తమని తోచునట్టి సిఫారసులను చేయవలెను.

అయితే, ఈ నియమావళిచే లేక సభాపతిచే ప్రభుత్వ సంస్థల సమితికి కేటాయింపబడినట్టి ప్రభుత్వ సంస్థలకు సంబంధించి కమిటీ తన విధులను నిర్వహింపరాదు.

**అంచనాల కమిటీ : (రూల్ 251 నుండి 253)**

కమిటీకి యుక్తమని తోచునట్టి లేదా సభవారిచే ప్రత్యేకముగా పంపబడినటి అంచనాలను పరిశీలించుటకు ఒక అంచనాల కమిటీ ఉండవలెను. కమిటీ విధులు ఈ విధంగా ఉండును.

(ఎ) అంచనాల విధానమున కనుగుణముగా పునర్ వ్యవస్థీకరణలోను, సమర్థతలోను లేక పరిపాలనా సంస్కరణలలోను ఎట్టి పొదుపులు, అభివృద్ధులు చేయబడవచ్చునో నివేదించుట.

(బి) పరిపాలనలో సమర్థతను, పొదుపును సాధించు నిమిత్తము ప్రత్యామ్నాయ విధానములను సూచించుట.

(సి) అంచనాలలో గర్భితమైవున్న విధానపు పరిమితుల లోపలే ద్రవ్యము సక్రమముగా వ్యయం చేయబడినది లేనిదీ పరిశీలించుట.

(డి) అంచనాలు ఏ నమూనాలో శాసనసభకు సమర్పింపబడవలెనో సూచించుట.

12 మంది సభ్యులను 9 మంది శాసనసభ నుండి ముగ్గురు శాసనమండలి నుండి ప్రాతినిధ్యం వహించే విధంగా ఈ కమిటీని సభాపతి నియమిస్తారు.

**ప్రభుత్వ సంస్థల కమిటీ : (రూల్ 254 & 255)**

అనుసూచికలో నిర్దిష్టపరుచబడిన ప్రభుత్వ సంస్థలు మరియు ఆయా సమయములందు సభాపతిచే నిర్దిష్టపరచబడినట్టి యితర ప్రభుత్వ సంస్థలు పనిచేయు తీరును పరీక్షించుట ప్రభుత్వ సంస్థల కమిటీ విధి.

**కమిటీ విధులు :**

(ఎ) అనుసూచికలో నిర్దిష్టపరచబడిన ప్రభుత్వ సంస్థల నివేదికలను, లెక్కలను పరిశీలించుట.

(బి) ప్రభుత్వ సంస్థలను గూర్చి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ యొక్క నివేదికలేవేని యున్నచో, వాటిని పరిశీలించుట.

(సి) ప్రభుత్వ సంస్థల స్వయం పాలనాధికారము, సామర్థ్యముల విషయములో ప్రభుత్వ సంస్థల వ్యవహారములు సక్రమ వ్యాపార సూత్రముల మరియు వివేకవంత మైన వాణిజ్య సంప్రదాయముల కనుగుణముగా నిర్వహింపబడుచున్నవా లేదా అని పరిశీలించుట.

(డి) పైన పేర్కొన్న ఖండములలో చేర్చబడని, అనుసూచికలో, నిర్దిష్టపరచబడిన ప్రభుత్వ సంస్థలకు సంబంధించి ప్రభుత్వ లెక్కల కమిటీ మరియు అంచనాల కమిటీకి విహితము చేయబడినట్టియు, సభాపతిచే ఆయా సమయములందు కమిటికి కేటాయింప బడునట్టియు యితర విధులను నిర్వర్తించుట.

12 మంది సభ్యులను 9 మంది శాసనసభ నుండి ముగ్గురు శాసనమండలి నుండి ప్రాతినిధ్యం వహించే విధంగా ఈ కమిటీని సభాపతి నియమిస్తారు.

**సంక్షేమ కమిటీలు - అనుసూచిత జాతుల సంక్షేమ కమిటీ : (రూల్ 274 & 275)**

రాష్ట్ర ప్రభుత్వ అధికార పరిధి క్రిందికి వచ్చు అనుసూచిత జాతుల సంక్షేమమునకు సంబంధించిన విషయములను పరిశీలించుట అనుసూచిత జాతుల సంక్షేమ కమిటీ విధి.

(ఎ) రాష్ట్ర ప్రభుత్వము తీసుకొన్న చర్యలను పరిశీలించుట, రాజ్యాంగ చట్టపు 16వ పరిచ్ఛేదము మరియు 335వ పరిచ్ఛేదములోని నిర్దేశములను పాటించి దాని అదుపులోనున్న ఉద్యోగములు మరియు పదవులలో అనుసూచిత జాతుల వారికి తగు ప్రాతనిధ్యమును సమకూర్చుట మరియు

(బి) సంక్షేమ కార్యక్రమముల ప్రగతి మరియు అమలు, యితర అభివృద్ధి చర్యలను అనుసూచిత జాతుల వారి నిమిత్తము రాజ్యాంగ రక్షణలను కూడా సమీక్షించుట కమిటీ విధులు. 12 మంది సభ్యులను 9 మంది శాసనసభ నుండి ముగ్గురు శాసనమండలి నుండి ప్రాతినిధ్యం వహించే విధంగా ఈ కమిటీని సభాపతి నియమిస్తారు.

**అనుసూచిత వర్గముల సంక్షేమ కమిటీ : (రూల్ 272 & 273)**

రాష్ట్ర ప్రభుత్వ అధికార పరిధి క్రిందకి వచ్చు అనుసూచిత వర్గముల సంక్షేమమునకు సంబంధించిన విషయములను పరిశీలించుట అనుసూచిత వర్గముల సంక్షేమ కమిటీ విధి.

(ఎ) రాష్ట్ర ప్రభుత్వము తీసుకొన్న చర్యలను పరిశీలించుట, రాజ్యాంగపు చట్టపు 16వ పరిచ్ఛేదము మరియు 335వ పరిచ్ఛేదములలోని నిర్దేశములను పాటించి, దాని అదుపులోనున్న ఉద్యోగములు మరియు పదవులలో అనుసూచిత వర్గములవారికి తగు ప్రాతినిధ్యమును సమకూర్చుట మరియు

(బి) సంక్షేమ కార్యక్రమముల ప్రగతి మరియు అమలును, ఇతర అభివృద్ధి చర్యలను, అనుసూచిత వర్గముల వారి నిమిత్తం రాజ్యాంగ రక్షణలను కూడా సమీక్షించుట కమిటీ విధులు. 12 మంది సభ్యులను 9 మంది శాసనసభ నుండి ముగ్గురు శాసనమండలి నుండి ప్రాతినిధ్యం వహించే విధంగా ఈ కమిటీని సభావతి నియమిస్తారు.

**వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటీ : (రూల్ 276 & 277)**

రాష్ట్రప్రభుత్వ అధికార పరిధి క్రిందికి వచ్చు వెనుకబడిన తరగతుల సంక్షేమమునకు సంబంధించిన విషయములను పరిశీలించుట వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటీ విధి.

(ఎ) రాష్ట్ర ప్రభుత్వము తీసుకొన్న చర్యలను పరిశీలించుట, రాజ్యాంగ చట్టపు 16వ పరిచ్ఛేదములోని నిర్దేశములను మరియు వెనుకబడిన కులముల వారికి రాష్ట్ర ప్రభుత్వము యిచ్చిన హామీలను పాటించి దాని అదుపులోనున్న ఉద్యోగములు మరియు పదవులలో వెనుకబడిన తరగతులవారికి తగు ప్రాతినిధ్యమును సమకూర్చుట.

(బి) సంక్షేమ కార్యక్రమముల ప్రగతి మరియు అమలు, ఇతర అభివృద్ధి చర్యలను వెనుకబడిన తరగతులవారి నిమిత్తం రాజ్యాంగ రక్షణలను కూడా సమీక్షించుట కమిటీ విధులు.

12 మంది సభ్యులను 9 మంది శాసనసభ నుండి ముగ్గురు శాసనమండలి నుండి ప్రాతినిధ్యం వహించే విధంగా ఈ కమిటీని సభాపతి నియమిస్తారు.

**స్త్రీ, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ కమిటీ: (రూల్ 283 & 284)**

రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో ఉన్న ఉద్యోగాల, పదవుల నియమాకాల్లో స్త్రీలకు తగినంత ప్రాధాన్యత ఉండే విధంగా ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. స్త్రీ, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, ఇతర అభివృద్ధి చర్యలు, సాధించిన ప్రగతిని సమీక్షించడం ఈ కమిటీ విధులు.

12 మంది సభ్యులను 9 మంది శాసనసభ నుండి ముగ్గురు శాసనమండలి నుండి ప్రాతినిధ్యం వహించే విధంగా ఈ కమిటీని సభాపతి నియమిస్తారు.

### అల్పసంఖ్యాక వర్గాలవారి సంక్షేమ కమిటీ : (రూల్ 285 & 286)

అల్ప సంఖ్యాకవర్గాల వారి సంక్షేమానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో వుండే అంశాలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమానికై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, ఇతర మెరుగుదల చర్యలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. వాటి పురోగతిని సమీక్షిస్తుంది.

12 మంది సభ్యులను 9 మంది శాసనసభ నుండి ముగ్గురు శాసనమండలి నుండి ప్రాతినిధ్యం వహించే విధంగా ఈ కమిటీని సభాపతి నియమిస్తారు.

### సదుపాయాల కమిటీ : (రూల్ 265 & 266)

(1) రాష్ట్ర శాసనసభ సభ్యులకొరకు గృహావసతికి సంబంధించిన అన్ని విషయములను నిర్వహించుట మరియు సభ్యులకు సమకూర్చబడిన వసతి, ఆహారము, వైద్య సహాయము యితర సౌకర్యముల నిమిత్తము ఏర్పాటు చేయబడిన సదుపాయములను పర్యవేక్షించుట సదుపాయముల కమిటీ విధులు.

(2) ఈ కమిటీ విధులు సలహా స్వభావము కలవి.

మొత్తం 12 మంది సభ్యులను, 9 మంది శాసనసభ నుండి మరియు ముగ్గురు శాసన పరిషత్తు నుండి ప్రాతినిధ్యం వహించే విధంగా ఈ కమిటీని సభాపతి నియమిస్తారు.



### సాధారణ ప్రయోజనాల కమిటీ : (రూల్ 278 నుండి 280)

సభాపతి ఆయా సమయములందు కమిటీకి పంపబడునట్టి సభావ్యవహారములకు సంబంధించిన విషయములను పరిశీలించుట మరియు సలహా యిచ్చుట కమిటీ విధి.

సభాపతి, ఉప సభాపతి, అధ్యక్ష పట్టికలోని సభ్యులు, శాసనసభ స్థాయీసంఘాల అధ్యక్షులు, గుర్తింపు పొందిన పార్టీలు, వర్గముల నాయకులు మరియు సభాపతి నామ నిర్దేశం చేయునట్టి ఇతర సభ్యులతో సభాపతి అధ్యక్షతన ఈ కమిటి నియమింపబడుతుంది.

### గ్రంథాలయ కమిటీ: (రూల్ 281)

విధులు :

(ఎ) సభాపతిచే ఆయా సమయములందు కమిటీకి పంప బడు గ్రంథాలయమునకు సంబంధించినట్టి విషయములను పరిశీలించి సలహా యిచ్చుట.

(బి) గ్రంథాలయ అభివృద్ధి నిమిత్తం సూచనలను పరిశీలించుట.

(సి) గ్రంథాలయముచే సమకూర్చబడిన సేవలను పూర్తిగా వినియోగించుటలో శాసనమండలి సభ్యులకు సహాయము చేయుట.

శాసనసభ నుండి 7గురు, శాసన పరిషత్తు నుండి ముగ్గురు ఆయా సభాపతులచే నామ నిర్దేశం చేయబడతారు. శాసన మండలి సభ్యుడు అధ్యక్షత వహిస్తారు.

### నియమముల కమిటీ : (రూల్ 269 నుండి 271)

విధులు : సభయందలి కార్యవిధాన, కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన విషయములను పరిశీలించుటకును, ఈ నియమావళికి



అవసరమని భావింపబడు ఏవేని సవరణలు లేక మార్పులను సిఫారసు చేయుట నియమముల కమిటి విధి.

శాసన సభాపతి అధ్యక్షతన అధ్యక్షునితో సహా 7 గురు సభ్యులతో ఈ కమిటీ నియమింపబడుతుంది.

### నైతిక విలువల కమిటీ : (రూల్ 287 నుండి 295)

సభలోపల మరియు సభ వెలుపల సభ్యుల అనైతిక ప్రవర్తన ఈ కమిటీ పరిశీలిస్తుంది. ప్రతి ఫిర్యాదును ఈ కమిటీ వాస్తవాలను ఆధారంగా చేసుకుని పరిశీలించి, అటు పిమ్మట సభకు నివేదికను సమర్పిస్తుంది. నివేదికలో తాను చేసిన సిఫారసులను అమలు చేసేందుకు సభ అనుసరించవలసిన కార్యవిధానాన్ని కూడా కమిటీ సూచిస్తుంది.

అధ్యక్షునితో కలుపుకొని 7గురు సభ్యులతో కూడిన కమిటీని సభాపతి నియమిస్తారు.

### వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ కమిటీ : (రూల్ 296 & 297)

వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను పరిశీలించేందుకు, ఎప్పటికప్పుడు పురోభివృద్ధిని సమీక్షించి, అవసరమైన సందర్భంలో తగు సలహాలను ఇస్తుంది.

సభాపతి అధ్యక్షతన 9 మంది శాసనసభ నుండి, 3 మంది శాసన పరిషత్తు నుండి ప్రాతినిధ్యం వహించే విధంగా ఈ కమిటీ నియమింపబడుతుంది.



# 10

## ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్య విధానం సంపుటి

## శాసనసభ కమిటీలు




ఆంధ్రప్రదేశ్ శాసన మండలి
సచివాలయం, వెలగపూడి, అమరావతి.